క్లుప్తంగా

నేటి నుంచి భాగవత సప్తాహం

ఇటిక్యాల: మండల పరిధిలోని కొత్త దేవరపల్లి పాండురంగస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్, వికాస తరగింణి ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఏడు రోజుల పాటు భాగవత సప్తాహం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున భగవత్ బంధువులు, భక్తులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

అయిజ: మండల కేంద్రంలోని గాజులపేటలో శనివారం రాత్రి విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ సిటీ–2 అధికారులు అక్రమంగా నిల్వ చేసిన 77 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ రూ.2,69,500 ఉంటుందన్నారు. నిందితుడి తో పాటు వాహనాన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్పుపై హర్షం

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని పైపాడు 1వ వార్డులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థల మార్పిడి చేయడంతో వార్డు సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాన రోడ్డు సమీపంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేకపోవడం, వాల్మీకి ఆలయం సమీపంలో మూల మలుపువద్ద ప్రమాదకరంగా ఉందని విద్యుత్‌శాఖ ఏఈ సుబ్బారాయుడుకు గతంలో విన్నవించుకున్నారు. స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షితమైన ప్రదేశంలో ఏర్పాటు చేశారు. దీంతో వార్డు ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నూతన కమిటీ ఎన్నిక



శాంతినగర్: ఉమ్మడి వడ్డేపల్లి, రాజోళి మండలాలకు సంబంధించి జీప్ డ్రైవర్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వీరేష్‌గౌడ్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాంతినగర్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జీప్ డ్రైవర్లు, ఓనర్ల సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కర్రెప్ప, కృష్ణ, సోమేష్, రాజు, బాబు, రవి, రమేష్, ఈశ్వర్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మానవపాడు: ప్రతి ఒక్కరూ తప్పకుండా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ చంద్రకాంత్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడుపరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత



ఉండవెల్లి: మండలంలోని అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. కర్నూలు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా అలంపూర్ చౌరస్తాలోని ఫ్లైఓవర్‌పై అదుపులోకి తీసుకొని శంషాబాద్‌కు చెందిన డ్రైవర్ కేతవాత్ బాలు, యజమాని హైదరాబాద్‌కు చెందిన ప్రభులింగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

మానవపాడు: మండలంలోని గోకులపాడు శివారు ప్రాంతంలో చెట్లను విద్యుత్ వైర్లు తాకుతున్న విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చెట్ల కొమ్మలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అంతిమ సంస్కారాలకు అవస్థలు

- వైకుంఠదామాల్లో కనీస వసతులు కరువు
- రూ.లక్షల్లో ఖర్చు.. తాళం వేసిన వైనం
- వాగులు, ఖాళీ స్థలాల్లో కొనసాగుతున్న అంత్యక్రియలు



కలుగోట్లలో కలుపు మొక్కలతో వైకుంఠదామం ఆవరణ

ఉండవెల్లి: అంతిమ సంస్కారాలైనా సాఫీగా జరగాలని మృతుడి కుటుంబ సభ్యులు ఖననం కోసం అవస్థలు పడకూడదన్న ఉద్దేశంలో గత ప్రభుత్వం హయాంలో 2019– 20 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలు వెచ్చించి గ్రామానికో వైకుంఠదామం(స్మశానవాటిక)లు నిర్మించారు. వాటి నిర్వాహణను అధికారులు విస్మరించడంతో ఇబ్బందులు తప్పడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

16 గ్రామాల్లో 8 గ్రామాల్లోనూ తిప్పలే

మండలంలోని 16 గ్రామాల్లో వైకుంఠదామాలు ఏర్పాటు చేశారు. నీటి సౌకర్యం, గదులు, రాత్రి వేళల్లో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు సోలార్ లైట్లను బిగించారు. మండలంలోని మెన్నిపాడులో ఇప్పటి వరకు ఖననాలే చేయలేదు. అదే విధంగా పుల్లూరు, కలుగొట్ల, కంచిపాడు, మారుమునగాల–2, షేరుపల్లి గ్రామాల్లో నిర్మించిన వైకుంఠదామాల్లో మౌలిక వసతుల లేమి కారణంగా నిరుపయోగంగా మారాయి. కొన్ని గ్రామాల్లో చెరువులు, వాగుల ఒడ్డున నిర్మించడంతో దారి కరువై పంట పొలాల నుంచి వెళ్లాల్సి దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో నీటి వసతి సరిగా లేకపోవడంతో స్నానాల కోసం పంట పొలాల్లో ఉన్న బోరుబావుల వద్దకు వెళ్తున్నట్లు వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ, సిబ్బంది నిర్వహణ లేకపోవడంతో వైకుంఠదామాల ఆవరణలో నిర్మించిన గదులు పేకాటరాయుళ్లకు, మందుబాబులకు అడ్డాగా మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు చొరవ చూపి వైకుంఠదామాల వద్ద కనీస వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



మెన్నిపాడులో ఖననాలే కానీ వైకుంఠదామం



పుల్లూరులో నది ఒడ్డున వైకుంఠదామం

నదిలోకి వెళాల్సిందే

మెన్నిపాడు గ్రామంలో వైకుంఠదామం నిర్మించిన నిర్వహణ లేక తాళాలు వేశారు. దీంతో చేసేదేమి లేక నదిలో ఖననాలు చేస్తున్నాం. రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన వైకుంఠదామాలు నిరుపయోగంగా మారాయి. – మద్దిలేటి, మెన్నిపాడు

కి.మీ. పోవాల్సిందే

గ్రామంలో రూ. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వైకుంఠదామం నిరుపయోగంగా మారింది. ఇప్పటి వరకు వైకుంఠదామంలో ఒక మృతదేహాన్ని కూడా పూడ్చలేదు. దీంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతోంది. – హరి, కంచుపాడు

తాళాలు వేసిన వాటిని పరిశీలిస్తాం

ప్రతి గ్రామంలో వైకుంఠదామాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో సొంత పొలాల్లో ఖననాలు చేసుకుంటున్నారు. పలు గ్రామాల్లో వైకుంఠదామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తాం. వైకుంఠదామాల్లో ఖననాలు చేసేలా అవగాహన కల్పిస్తాం.

– తిరుపతన్న, ఎంపీడీఓ

గడప గడపకూ బీజేపీ



అయిజలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



చిన్నతాండ్రపాడులో బీజేపీ పథకాలను వివరిస్తున్న గోపాలకృష్ణ

అయిజ: మండలంలోని చిన్నతాండ్రపాడులో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ నాయకులతో కలిసి గడప గడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి గ్రామ పంచాయతికి నేరుగా బడ్జెట్ కేటాయిస్తున్న ఘనత బీజేపీకే దక్కిందన్నారు. సీసీరోడ్లు, రైతువేదికల నిర్మాణం, ఉచిత సన్నబియ్యం పంపిణీ, ఆయుష్మాన్ భారత్, అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం తదితర పథకాలను బీజేపీ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తుందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భీముడు, సతీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

అయిజ/అలంపూర్ రూరల్: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు. రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు ప్రధానమంత్రి ధన్ ధ్యాన కృషియోజన పథకాన్ని ప్రారంభించినందుకు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాదన్న, లక్ష్మణాచారి, గోపాలకృష్ణ, మారెప్ప, తదితరులు పాల్గొన్నారు.

❖ అలంపూర్ పట్టణంలోని గాంధీచౌక్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. శరత్‌బాబు, మల్లయ్య, రంగస్వామి, వెంకటస్వామి, రమేశ్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

మానవపాడు: మండలంలోని అమరవాయిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇంటిని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లోకేశ్, మోహన్, వినయ, మురళీ, తాహెర్, సిరాజ్, జహంగీర్, ప్రసాద్, రవి, రాజేష్ రమేష్, జోహర్ తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కార్మికులకు పనిభారం తగ్గించాలి

రాజోళి: కార్మికులకు పనిభారం తగ్గించాలని, అదే విధంగా రూ.26 వేల కనీస వేతనాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు లక్ష్మన్న ఆధ్వర్యంలో రెండో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్మికుడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమను దోచుకుంటున్నాయన్నారు. శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదన్నారు. అంగన్‌వాడీ ఆశా వర్కర్లకు ఆన్‌లైన్ వర్క్ పేరుతో పని భారం పెంచడం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. భవన నిర్మాణ రంగంలో ఉన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం 11 మంది సభ్యులతో కూడిన సీఐటీయూ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయ్‌కుమార్, సుజాత, మహాలక్ష్మి, సుశీల, సువర్ణ, నడిపన్న, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఇటిక్యాల: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని గ్రామాల్లో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పనులపై 15వ విడత సామాజిక తనిఖీ ఆదివారం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని రూ.7,32,91,731 పనులు జరిగాయన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ రూ.4,51,242 సామగ్రి రూ.84,10,533 అదే విధంగా పంచాయతీరాజ్ ద్వారా సామగ్రి ఖర్చు రూ.97,34,670, కూలీల ఖర్చు రూ.28,286 ఉన్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం గ్రామాల్లో తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పర్యటిస్తుందని, ఈ నెల 17వ తేదీన మండల కేంద్రంలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



సాతర్ల ఉపాధి పనులపై గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

చెరువును తలపిస్తున్న క్రీడా ప్రాంగణం



ఇటిక్యాల గురుకులంలో నిలిచిన వర్షం నీరు



వర్షం నీటిలో గురుకుల విద్యార్థులు

ఇటిక్యాల: ఇటీవల కురిసిన వర్షాలకు మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడా ప్రాంగణంలో భారీగా వర్షం నీరు చేరడంతో చెరువును తలపిస్తోంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు వర్షం నీటిలో నుంచే వస్తున్నట్లు వాపోతున్నారు. వర్షం నీరు మురుగుగా మారడంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని పేర్కొంటున్నారు. చుట్టు పక్కల పంట పొలల నీరు సైతం క్రీడా ప్రాంగణంలోకి చేరడంతో విద్యార్థులు రోజుల తరబడి క్రీడలకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల పాఠశాలలో 9వ తరగతి గదిలోకి పాము రావడం కలకలం రేపింది. ఇట్టి విషయమై ప్రధానోపాధ్యాయుడు సురేష్‌ను సాక్షి వివరణ కోరగా.. వర్షం నీటి సమస్య పాఠశాల మొదటి నుంచే ఉందన్నారు ఇటీవలే కలెక్టర్ సంతోష్ గురుకుల పాఠశాలను సందర్శించగా వర్షం నీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లినా సమస్య తీరలేదని పేర్కొన్నారు.

ఇసుక ఇవ్వకుండా అడ్డుకుంటారా?

రాజోళి: ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ నాయకులే ఇసుక రానివ్వకుండా అడ్డుకుంటారా? అంటూ తుమ్మిళ్ల గ్రామస్తులు కొందరు చేసిన పోస్టింగ్ సోషల్ మీడియాలో ఆదివారం హల్‌చల్ అయ్యింది. రాజోళి మండలం తుమ్మిళ్ల గ్రామంలో రీచ్ నుంచి ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తీసేందుకు అనుమతులు రావడంతో అక్కడి నుంచి ఇసుక జిల్లాకు టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. కాగా ఇసుక రీచ్ వద్ద పలు ఇసుక తరలిస్తున్న వాహనాలను గ్రామస్తుల పేరిట కొంతమంది అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఇసుక వాహనాలను గ్రామస్తులు ఆపలేదని, కొందరు అధికార పార్టీ నాయకులే చేశారని వారిపై మండిపడుతూ.. వారు చేసిన పోస్టు జిల్లాలోని పలు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఇసుక తరలిస్తున్న టిప్పర్లు రీచ్ నుంచి బయటకు కదిలాయి.



తుమ్మిళ్ల రీచ్ వద్ద నిలిచిన ఇందిరమ్మ ఇసుక వాహనాలు

ఎమ్మెల్యే పరామర్శ



ఇటిక్యాల: మండల పరిధిలోని వావిలాల గ్రామానికి చెందిన జమ్మన్న రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఆదివారం జమ్మన్నను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

సొంత పనులకు ప్రభుత్వ ట్రాక్టర్



కేటీదొడ్డి: గ్రామంలోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. గ్రామ పాలకుల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల పర్యవేక్షణ కరువైంది. ట్రాక్టర్‌ను గ్రామానికి చెందిన పలువురు నాయకులు సొంత పనులకు ఉపయోగించుకుంటున్నారు. ఆదివారం మండల పరిధిలోని ఉమిత్యాలతాండ పంచాయతీ ట్రాక్టర్‌ను పలువురు నాయకులు వ్యక్తిగత అవసరాల కోసం వినియోగిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి అనుమతులు లేకుండానే ట్రాక్టర్ ద్వారా అక్రమంగా మట్టి తరలింపు చేపట్టినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మట్టి తరలింపునకు ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

ఎర్రవల్లి: వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసినట్లు కోదండాపురం ఎస్ఐ మురళి ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల పరిధిలోని దువాసిపల్లి గ్రామానికి చెందిన గద్దెపోగు పెద్దబీసన్న(65) శనివారం ఎర్రవల్లి నుంచి ఆటోలో స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో డ్రైవర్ చాకలి మహేష్ అజాగ్రత్తగా నడపడంతో ఆటో నుంచి జారిపడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడు గద్దెపోగు ఏసన్న ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

చిన్నంబావి: మండలంలోని పెద్దమారు గ్రామంలో సుంకులమ్మ ఆలయ నిర్మాణానికి సీఐ వెంకటేశ్వర్లు రూ.55 వేల ఆర్థిక సాయం అందజేశారు. సొంత గ్రామానికి సేవ చేయాలనే దృక్పథంతో తన వంతు సహకారం అందిస్తున్నానని సీఐ అన్నారు. అదే విధంగా గ్రామ అభివృద్ధి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎత్తం పకీరయ్య, స్వాములు, దేవరపోగు మధు, నాగరాజు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో 1989–90 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో మిత్రులు నర్సింహులు, కాశీ, ఎల్లయ్య, విజయ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రమాదకరంగా మలుపులు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, పెద్దపోతులపాడు, జల్లాపురం చందూరు, అమరవాయి, కలుకుంట్లకు వెళ్లే రోడ్లలో ప్రమాదకరంగా మూల మలుపులు ఉన్నాయి. నిత్యం ఈ దారి గుండా వందల సంఖ్యలో ప్రజలు, వాహనాదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు దట్టంగా ఉండటంతో ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మానవపాడు- చెన్నిపాడు రోడ్డులో ప్రమాకరంగా మలుపు

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

అమరచింత: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను వెంటనే అరెస్టు చేయాలంటూ డీహెచ్‌ఎస్ జిల్లా కార్యదర్శి రవీందర్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు భాస్కర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఆయా సంఘాల నాయకులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన చేపట్టారు. న్యాయమూర్తిపై పథకం ప్రకారం దాడి జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు శ్యాంసుందర్, ఇబ్రాయిల్, సోలు, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సంఘాల నాయకులు

దాబాల్లో దర్జాగా సిట్టింగులు



నందిన్నెలో మద్యం అమ్ముతున్న ఓ దాబా



నందిన్నెలోని ఓ దాబాలో ఉన్న మద్యం సీసాలు

- మందుబాబుల విందులు నిత్యకృత్యం
- అధిక ధరలకు మద్యం విక్రయాలు
- పట్టీపట్టని ఎక్సైజ్ అధికారులు

కేటీదొడ్డి: దాబాల్లో లిక్కర్ తాగడంపై నిషేధం ఉన్నా మండల పరిధిలోని పలు దాబాల్లో దర్జాగా సిట్టింగులు నిర్వహిస్తున్నారు. మండలంలోని పాతపాలెం, మైలగడ్డ స్టేజ్, నందిన్నె, తదితర ప్రాంతాల్లోని దాబా హోటళ్లల్లో మందు బాబుల విందులు నిత్యకృత్యమయ్యాయి. దాబా యజమానులు ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక గదులను ఏర్పాటు చేయడమే కాకుండా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో గుట్టుచప్పుడు కాకుండా సిట్టింగులు ఏర్పాటు చేసేవారు. కానీ ప్రస్తుతం పట్టపగలు, ఆరుబయట టేబుళ్లు వేసి మరీ మద్యం తాగేందుకు అనుమతిస్తున్నారు. నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు దాబా నిర్వహకులపై చర్యలు తీసుకోకపోవడంతోనే అమ్ముతున్నారని విమర్శలు ఉన్నాయి. మద్యం సేవించి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

దాబాల్లో మద్యం తాగడం నేరం. మండలంలో ఎక్కడైనా అక్రమంగా దాబాల్లో మద్యం అమ్మకాలు జరిగినట్లు తాగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. అలా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మద్యం విక్రయించే దాబాలపై కేసు నమోదు చేస్తాం.

– గణపతిరెడ్డి, ఎక్సైజ్ సీఐ, గద్వాల